# నా ప్రేయసి

అందీ-అందని ప్రేమలోకపు టంచుల్ని పట్టుకుని ఊహించడానికి ప్రయత్నించి, ఏనిర్ణయానికీ రాలేక, నారీ హృదయపు టగాధంలో, వెలుతురుకోసం చీకటిలో తడుముకుంటూ అర్థంకాని అయోమయావస్థలోపడ్డ నాచరిత్ర మీరు వింటారని ఆశిస్తాను.

నేను ఎక్కువ పరిచయంతో మెలిగే స్త్రీలు ముచ్చటగా ముగ్గురు. మాఅమ్మ, మా అక్క; ఇక మూడవవ్యక్తి, నేను అర్థం చేసుకోడానికిసతమత మవుతున్న "నా ప్రేయసి." అందువల్ల, స్త్రీలతో చనువుగా మెలిగి,వాళ్ళ హృదయపు లోతుల్ని, ప్రేమ, వాత్సల్యం మమకారం, అభిమానం వగైరా కొలతబద్దలతో కొలవగలిగే సామర్థ్యం నాకు కలగలేదు.

నాకథ టూకీగా చెప్పి అసలు విషయానికి వస్తాను. మాఅమ్మకి నేను ఒక్కణ్ణే గారాల బిడ్డని. నాకో అత్తయ్య వుండేది. ఆవిడకి ఒక కూతురు వుంది. చిన్నప్పట్నించీకూడా నేను, మాఅత్తయ్య కూతురు కలిసిమెలిసి తిరిగేవాళ్ళం. ఇద్దరం కలిసి ఆడుకునేవాళ్ళం. ఇద్దరం కలిసి ఒక్కొక్కప్పుడు దుర్గగుడికి వెళ్ళి రాత్రి అయ్యాక వొచ్చేవాళ్ళం. ఇది బాల్యం సంగతి. తరవాత నేనావూరు విడిచిపెట్టి వచ్చేయడం, ఆతరువాత మాయిద్దరిమధ్య 4, 5 సంవత్సరాల "ఎడబాటు" లాంటిది ఉండటం జరిగాయి.

నేను "ప్రేమ" అనే పదాన్ని అర్థం చేసుకోడానికి, ప్రేమకి సంబంధించిన పుస్తకాలెన్నో చదివాను. నేను తీవ్రాలోచనలు జరిపి "ప్రేమ" అనేపదానికొక నిర్వచనాన్ని ఏర్పరచుకున్నాను. సూక్ష్మంగా చెప్పాలంటే ఆ నిర్వచనమే నేను నారీ హృదయపు టగాధంలో ఉండే "ప్రేమ"ని కొలవడానికి ఉపయోగించిన కొలతబద్దన్నమాట.

నేను ప్రేమించడం ప్రారంభించడం ఇదే మొదటి సారవడంవల్ల, నేను, యిన్ని సంవత్సరాలు కష్టపడి—సినిమాలుచూసి రకరకాలయిన ప్రేమగాథలు చదివి—సంపాదించిన విజ్ఞానంలో కనీసం సహస్రాంశమన్నా "నిజం" ఉండదా, అనుకున్నాను. ఈమధ్య నాకు కలిగిన ఒక అనుభవంవల్ల ఆ సహస్రాంశం కూడా సందేహాస్పదంగానే కనబడింది.

మా అత్తావాళ్ళ ఊరెళ్ళాను. ఇంటికెళ్ళి "నా ప్రేయసి" కోసం చూశాను. నేను లోపలికి వెళ్ళగానే మా అత్త వచ్చి కుశల ప్రశ్నలు వేసింది. అంతా బాగానే ఉందనుకున్నాను. కాని నాకు నా ప్రేయసి ఎంతకీ ఎదట పడకపోయేసరికి, చాలా బాధకలిగింది. ఇక ఉండబట్టలేక అత్తయ్యని అడిగేశాను. అన్నట్టు ఇక్కడ నా ప్రేయసి పేరు చెప్పడం మర్చిపోయాను. "ప్రేయసి" పేరు రాధ అన్నమాట—

"అత్తయ్యా! రాధేది" అన్నాను.

అత్తయ్య చిరునవ్వు నవ్వుతూ"అది నిన్ను చూసి ఎక్కడో దాక్కునుంటుంది? అని "ఇదేం పిల్లలో" అంటూ,

"రాధా! బావొచ్చాడు కదా! ఎక్కడో దాక్కుంటావేమే? ఇలారా" అంది.

రాధ ప్రక్కగదిలోంచి వచ్చి, సిగ్గుపడుతున్నట్టు తలవంచి

"శ్రీ అనూరాధ"

"ఎప్పుడు రావడం?" అంది.

"ఇప్పుడే. మెయిల్లో వచ్చాను"అన్నాను నేను సంభాషణ ఎల్లా పొడిగించాలా అని చూస్తూ.

ఇంతలో అత్తయ్య

"అవునుకాని, మీ అమ్మ ఒంట్లో ఎల్లా ఉంటోందిప్పుడు" అని మధ్యలో అడిగింది.

"ఇపుడు కులాసాగానే ఉంది" అని, ఆమె యింకెక్కడ ప్రశ్నలతో చంపుతుందో అని రాధకేసి తిరిగి,

"ఏమిటి చదువుతున్నావ్?" అన్నా ఆమె చదివే పుస్తకమేమిటో తెలుసుకుందామని.

"దేవదాసు, శరత్‌బాబుది" అంది చాలా బావుంటుందన్నట్టు.

ఇంతట్లో అత్తయ్య తప్పచేసిందన్నాగ.

"లేనాయనా! లేచి స్నానంచెయ్యి తరవాత తీరుబడిగా కావలసినంత మాట్లాడుకోవచ్చు" అని, రాధతో.

"బావకి నీళ్ళుతోడవే" అని వంటయింట్లోకి వెళ్ళిపోయింది.

ఇప్పుడు ఏకాంతంగా ఉందిగదా అని నేను నాపరీక్ష ప్రారంభించాను.

"నువ్వు బాగా మారిపోయావు రాధా!" అన్నాను. ఆశ్చర్యంగాచూసి రాధ అంది,

"ఏంబావా! అంత మారిపోయానా"

ఇంక తర్వాత ఏంమాట్లాడాలో నాకు తోచలేదు.

"రాధా!నిన్ను చూడాలని నాకెంతకాలం నించో వుంది. నీవిశాల నేత్రాల్లో నా ప్రతిబింబం చూసుకోవాలని, నిన్ను నాహృదయరాణిగా చేసుకోవాలని......"...వగైరా అంతా అందామనుకుని నోరువిప్పి.

"నువ్వు బాగా మారిపోయేవురాధా!" అనేశాను. నాకే అర్థంకాలేదు నేనల్లా ఎందుకనలేకపోయానో. భోజనం, అన్నీ అయిపోయాక, నాకొకగది చూపించి పడుకోమన్నారు. పడుకున్నానన్నమాటే గాని, నిద్రగాలేదు. రాధకనబడితే "ప్రేమ" సంభాషణ ఎల్లా జరపాలా అని ఆలోచించాను.

మూడుగంటలకి, రాధ కాఫీ, ఫలహారం పట్టుకొచ్చి. "బావా! బావా!" అంది.

ఏకో ప్రేమ సామ్రాజ్యానికి అధిపతిలా, కళ్ళుపెట్టి రాధకేసి చూశాను.

"నిన్ను నేను ప్రేమిస్తున్నాను రాధా! కళ్ళలో దాగిన నీ అందాన్ని దోచుకోవాలని వుంది" అని అందామనుకుని,

నోరు విప్పబోయేటప్పటికి—

"లే బావా! కాఫీ టిఫిను తీసుకో" అంది రాధ తల వంచుకుని.

కాఫీ తీసుకుంటూ, అతికష్టంమీద, "ఎన్నో సంవత్సరాలకి మళ్ళా ఈవాళ... ఇలా రావడానికి వీలుపడింది" అన్నా.

"ఈనాటికైనా మేము గుర్తుకొచ్చాం" అంది రాధ చిరునవ్వు నవ్వుతూ.

చిన్నప్పటి రాధేనా అనిపించింది నాకు. "బావా! మనిద్దరం పెళ్ళి చేసుకుందా"మని చిన్నప్పుడు, "ఒట్టు" వేసిన రాధేనా అనిపించింది నాకు. "ఏమిటి! ఇలా మారిపోయింది" అనుకున్నా మనస్సులో.

సాయంత్రం వెళ్ళిపోయేటప్పుడు, రాధ ఒంటరిగా ఉండడంచూసి, "నేను ఈరాత్రి వెళ్ళి పోతున్నాను రాధా!" అన్నాను నెమ్మదిగా.

రాధ తల వంచుకుని నిలబడింది.

"నేను వెళ్ళిపోతున్నాను రాధా!" అన్నా తెగించి గట్టిగా.

రాధ తల పైకెత్తి—"అంత తొందరేం, రేపు.వెళ్ళకూడదా!" అంది.

"లేదు, అవసరమైన పనులున్నాయ్" అన్నా.

"సరే...వెళ్ళు...ఎప్పుడేనా..." అంది చిరునవ్వుతో.

"అలాగే" అని నేను జట్కాలో కూలబడి, ఆశతో కిటికీ ఊచలకేసి చూశాను.

కిటికీ ఊచలు పట్టుకుని నిలబడింది రాధ. రెండు కన్నీటి చుక్కలు నెమ్మదిగా ఆమె చెంపలమీదకి జేరాయి.

సంగుమలుపు తిరిగేంతవరకు ఆ కిటికీ ఊచలకేసి చూస్తూ, సంగుమలుపు తిరగానే అర్థంకాని బాధతో తల వంచుకున్నాను.★